సాక్షి
కాకినాడ
శనివారం । 15 । జూన్ । 2024



రూ.1,01,116 విరాళం


ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి కూనప రెడ్డి వెంకట ప్రసాద్ దంపతులు (భీమవరం) రూ.1,01,116 విరాళం సమర్పించారు.



ముద్దులొలుకు నా సామికి..

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామివారి కల్యాణోత్సవాలు శుక్రవారం ప్రారం భమయ్యాయి. అమ్మవార్లను, స్వామిని వధూవరులుగా అలంకరించారు. - 8లో▸

డెల్టాలకు 8,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 8,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.55 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

పని ప్రదేశాలు ఆహ్లాదంగా ఉండాలి



పోలీస్ స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రారంభించిన ఎస్పీ సతీష్ కుమార్

సామర్లకోట: ఉద్యోగులు పని చేసే ప్రదేశాలు ఆహ్లాదకరంగా ఉండాలని, అప్పుడే మరింత ఉత్సాహంగా పని చేయడానికి అవకాశం ఉంటుందని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో చేపట్టిన ఆధునీకరణ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. సిబ్బంది పని చేసే హాలు, రైటర్, సీఐ, ఎస్సైల గదులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రజలకు కష్టం వస్తే ఆస్పత్రులు, పోలీస్ స్టేషన్లకే వస్తారని, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని అన్నారు. సామర్లకోట పోలీస్ స్టేషన్‌ను సుందరంగా తయారు చేయాలనే ఆలోచన సీఐ సురేష్‌కు రావడం, దానికి డీఎస్పీ అనుమతి లభించడంతో ఇక్కడ మంచి వాతావరణం ఏర్పడిందన్నారు. సిబ్బంది పని చేసి, అలసిపోయిన సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి మొదటి అంతస్తులో సదుపాయాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. స్టేషన్ ఆధునీకరణకు సహకరించిన జేపీ కన్‌స్ట్రక్షన్స్ మేనేజింగ్ పార్టనర్ ప్రభాకర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ కె.లతాకుమారి, ట్రైనీ డీఎస్పీ యశ్వంత్ ఈశ్వర్, సీఐలు డి.సురేష్, అంకబాబు, ఎస్సైలు వి.మౌనిక, పీవీఆర్ మూర్తి, ఏఎస్సై రత్నం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయంలో భక్తుల రద్దీ

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలి వచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారి వ్రతాలు 1,500 నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజనం చేశారు.

ఘనంగా చండీ హోమం

అన్నవరం: రత్నగిరి దుర్గామాత వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఘనంగా చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పండితులు హోమం ప్రారంభించి, 11 గంటలకు పూర్ణాహుతి గావించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించి, భక్తులకు పంపిణీ చేశారు. చండీ హోమం, పూజా కార్యక్రమాలను వేద పండితులు ముష్టి పురుషోత్తం, అర్చకులు కోట వంశీ, పరిచారకులు ఫణి శర్మ, నరసింహారావు, వ్రత పురోహితులు దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు నిర్వహించారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టికెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు. కాగా, సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నరసింహమూర్తి, కొండ దిగువన తొలి పావంచా వద్ద వేంచేసిన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిభట్ల సాయిరామ్ ఆధ్వర్యాన ఘనంగా కుంకుమ పూజలు నిర్వహించారు.

ఐటీఐ అడ్మిషన్లకు 18న ఇంటర్వ్యూలు

కాకినాడ సిటీ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ జిల్లాల్లో ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ శుక్రవారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. కోనసీమ జిల్లా అభ్యర్థులకు అమలాపురంలోని ఉపాధి శిక్షణ సంస్థలోను, కాకినాడ జిల్లా వారికి కాకినాడ ఐటీఐలోను ఇంటర్వ్యూలు జరుగుతాయని వివరించారు. 1 నుంచి 117 మంది మెరిట్ విద్యార్థులకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జీఎంగా ఆదిశేషు

కాకినాడ సిటీ: జిల్లా పరిశ్రమల శాఖ ఇన్‌చార్జి జనరల్ మేనేజర్(జీఎం)గా ఏలూరు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ వి.ఆదిశేషు నియమితులయ్యారు. ఆయన శుక్రవారం బాధ్యతలు తీసుకున్న అనంతరం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

కూటి కోసం.. కూలి కోసం తెల్లవారుజామునే బయలుదేరిన ఆ బతుకులు అర్ధాంతరంగా తెల్లారిపోయాయి. ఘోర రోడ్డు ప్రమాదం ఆ కుటుంబాలను దుఃఖసాగరంలో ముంచేసింది. ఉరకలు వేసే ఉత్సాహంతో చేపల పట్టుబడి, ప్యాకింగ్ పని చేస్తూ కుటుంబాలకు 'పెద్ద' దిక్కుగా మారిన ఆ యువకులు.. అయిన వారిని హఠాత్తుగా బతుకు సంద్రంలో వదిలేసి వెళ్లిపోయారు. వేకువజామునే ఉలికిపాటుకు గురి చేసిన ఈ విషాద ఘటన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వాసులను కలచివేసింది. కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలం సీతనపల్లి వద్ద శుక్రవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ఐదుగురు మృతి చెందారు. మరో ఐదుగురు గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. ఈ దుర్ఘటనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందిన చింతా లోవరాజు, మాగాపు నాగరాజు మృతి చెందగా చింతా దుర్గాప్రసాద్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. అలాగే, ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం గ్రామానికి చెందిన రేవు భూషణం, పెనంగి కనకరాజు అక్కడికక్కడే మృతి చెందగా మల్లాడి శ్రీకాంత్, రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్రబాబు తీవ్ర గాయాలపాలయ్యారు. **కాకినాడ జిల్లా కరప మండలం గొర్రిపూడికి చెందిన వ్యాన్ డ్రైవర్ గండి ధర్మవరప్రసాద్ కూడా ఈ ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు.**

ఉపాధి ఆశలో తుది శ్వాస



గొర్రిపూడిలో విలపిస్తున్న ధర్మ వరప్రసాద్ తల్లి వరలక్ష్మిని ఓదారుస్తున్న ఇరుగుపొరుగు మహిళలు

ఎప్పటి లాగే వెళ్లి.. ఎన్నటికీ తిరిగిరాని లోకాలకు..

ప్రమాదంలో గెద్దనపల్లికి చెందిన ఇద్దరు బలి



గెద్దనపల్లిలో నానమ్మ సూర్యకాంతం ఒడిలో విచారంగా కూర్చున్న మాగాపు నాగరాజు కుమార్తె చంద్రిక, విలపిస్తున్న కుటుంబ సభ్యులు



చింతా లోవరాజు(ఫైల్)



మాగాపు నాగరాజు (ఫైల్)

కాట్రేనికోన: బతుకు తెరువులో భాగంగా రోజూ మాదిరిగానే చేపల ప్యాకింగ్‌కు వెళ్లిన ఆ ఇద్దరూ ఇక ఎప్పటికీ తిరిగి రాని లోకాలకు వెళ్లిపోయారన్న చేదు నిజాన్ని ఆ కుటుంబాలు జీర్ణించుకోలేకపోతున్నాయి.

సీతనపల్లి ప్రమాదంలో మృతి చెందిన చింతా లోవరాజు (31), మాగాపు నాగరాజు (32), తీవ్రంగా గాయపడిన చింతా దుర్గాప్రసాద్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం గెద్దనపల్లికి చెందినవారు. ఈ ముగ్గురూ తాళ్లరేవుకు చెందిన చేపల వ్యాపారి వద్ద రెండేళ్లుగా పని చేస్తున్నారు. రోజూ మాదిరిగానే శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో వీరు గెద్దనపల్లిలో బయలుదేరి తాళ్లరేవు వెళ్లారు. అక్కడి నుంచి కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలంలో చెరువుల వద్ద చేపలు ప్యాకింగ్ చేసే పనికి వెళ్లారు. దారిలో వారిని రోడ్డు ప్రమాదం బలిగొనడంతో నాగరాజు, లోవరాజు కుటుంబ సభ్యులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

కన్నీటి పర్యంతమైన లోవరాజు తండ్రి

గెద్దనపల్లికి చెందిన చింతా వీర వెంకట సత్యనారాయణకు ఐదుగురు మగ సంతానం. చేపల వేటపై ఆధారపడి జీవించే నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడం, చేపల వేట అంతంత మాత్రంగా ఉండటంతో చేపలు ప్యాకింగ్ చేసేందుకు వెళుతున్నారు. ఇద్దరు కుమారుల్లో లోవరాజు మృతి చెందగా, దుర్గాప్రసాద్ తీవ్ర గాయాల పాలయ్యాడని సత్యనారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు.



భార్య పిల్లలతో మృతుడు చింతా లోవరాజు(ఫైల్)

ఏడేళ్ల లోపు చిన్నారులు

మృతుడు లోవరాజుకు భార్య విజయలక్ష్మి, ఏడేళ్ల లోపు పిల్లలు దేవిశ్రీ, హేమంత్ ఉన్నారు. లోవరాజు మృతి చెందిన విషయం తెలిసిన వీరు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. గాయపడిన దుర్గాప్రసాద్‌కు భార్య కస్తూరి, ఐదేళ్ల లోపు పిల్లలు తేజశ్రీ, వీరేంద్రకుమార్ ఉన్నారు.

తండ్రి చనిపోవడంతో అనాథ అయిన చంద్రిక

రోడ్డు ప్రమాదంలో మాగాపు నాగరాజు తిరిగిరాని లోకానికి వెళ్లిపోవడంతో అతని కుమార్తె చంద్రిక (5) అనాథ అయింది. నాగరాజుకు ఇద్దరు పిల్లలు. భార్య రెండేళ్ల క్రితం వదిలి వేయడంతో ఆరు నెలల క్రితం విడాకులు తీసుకుని కుమారుడిని తన వద్దనే ఉంచుకుంది. నాగరాజు కుమార్తె చంద్రిక నానమ్మ సూర్యకాంతం వద్ద ఉంటోంది. తండ్రి ఇక రాడన్న విషయం తెలిసిన ఆ చిన్నారి నానమ్మను పట్టుకుని రోదిస్తోంది.

మృత్యు ఒడికి తీసుకెళ్లిన డ్రైవింగ్

- గొర్రిపూడిలో విషాద ఛాయలు
- దిక్కెవరంటూ విలపిస్తున్న ధర్మవరప్రసాద్ భార్య, తల్లిదండ్రులు



మృతుడు వరప్రసాద్ (ఫైల్)



గాయపడ్డ మహేష్‌కుమార్

కరప: జీవనోపాధి కోసం ఎంచుకున్న డ్రైవింగ్ రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడిని అనంత లోకాలకు తీసుకుపోయింది. తల్లిదండ్రులకు అండగా ఉంటూ భార్య, ఒక కుమార్తెతో సంతోషంగా గడుపుతున్న ఆ యువకుడి కుటుంబం ఒక్కసారిగా దుఃఖ సాగరంలో మునిగిపోయింది. భార్య గర్భవతి, త్వరలోనే ఇంటి వారసుడు పుడతాడని ఆశలు పెట్టుకున్న ఆ కుటుంబానికి ఉన్న ఆధారాన్ని విధి లాక్కెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు గుండెలవిసేలా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. సీతనపల్లిలో శుక్రవారం ఉదయం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన యువకుడు గండి ధర్మవరప్రసాద్ (27) మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన మరొక యువకుడు మేడిశెట్టి మహేష్‌కుమార్ ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలయ్యాయి. ధర్మవరప్రసాద్ బతుకుతెరువు కోసం డ్రైవింగ్ నేర్చుకుని ట్యాక్సీపై డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య వరలక్ష్మి, ఏడాదిన్నర కుమార్తె ఉన్నారు. వరలక్ష్మి ప్రస్తుతం ఆరు నెలల గర్భిణి. వరప్రసాద్ తండ్రి సత్యనారాయణమూర్తి దివ్యాంగుడు. ఆయనకు కొంత కాలం క్రితం రోడ్డు ప్రమాదంలో ఒక కన్ను దెబ్బ తింది. దీంతో ఏ పనీ చేయలేక ఇంటి వద్దనే ఉంటున్నారు. తల్లి వరలక్ష్మి(భార్య పేరు తల్లి పేరు ఒకటే)కి వినికిడి లోపం ఉంది. తాత ధర్మారావు దివ్యాంగుడు వీరితోనే ఉంటున్నాడు. వీళ్లందరికీ వరప్రసాద్ సంపాదనే జీవనాధారం. కారు డ్రైవర్‌గా పని చేస్తున్న వరప్రసాద్ ఇటీవలనే ఒక చేపల కంపెనీ వ్యాన్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ వ్యాన్‌లో డ్రైవర్‌తో పాటు మరో 10 మంది ఒక బృందంగా చేపలు, రొయ్యల పట్టుబడికి వెళుతుంటారు. చేపల పట్టుబడిలో కూడా పని చేయడం ద్వారా వరప్రసాద్ డ్రైవర్ జీతంతో పాటు, పట్టుబడికి మరికొంత సొమ్ము కూడా సంపాదించుకుంటున్నాడు. భార్య వరలక్ష్మి గర్భిణి కావడంతో **ఈసారి మగ పిల్లవాడు పుడతాడని, పిల్లలిద్దరినీ కష్టపడి చదివించుకుందామనుకునేవారని చుట్టుపక్కల కుటుంబాల వారు తెలిపారు. ఈ నేపథ్యంలో వరప్రసాద్ శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు గొర్రిపూడికి చెందిన చేపల కంపెనీ గుమాస్తా మేడిశెట్టి మహేష్‌కుమార్‌తో కలసి బొలేరో వ్యాన్‌లో బయ**లుదేరి వెళ్లారు. కోనసీమ జిల్లాకు చెందిన మరో 9 మందిని ఎక్కించుకుని చేపల పట్టుబడికి బయలుదేరారు. రోడ్డు ప్రమాదంలో ధర్మవరప్రసాద్ మృతి చెందగా మహేష్ కుమార్‌కు గాయాలయ్యాయి.

ఆ దుఃఖం ఆపతరమా..

ప్రమాదం గురించి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు ఫోన్ రాగానే, బంధువులు ఆదరాబాదరాగా ఘటనా స్థలానికి వెళ్లారు. ధర్మవరప్రసాద్ ఇంటి పరిసర గృహాల వారు అతడి తల్లి వరలక్ష్మిని, తాతయ్య ధర్మారావును ఓదార్చారు. 'కుటుంబానికి అండగా ఉంటూ, అందరినీ కంటికి రెప్పలా చూసుకుంటున్నావనుకుంటే దేవుడు అర్ధాంతరంగా తీసుకెళ్లిపోయాడా! మాకు దిక్కెవరు! కొడుకా, నా కొడుకా' అంటూ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే ఇరుగుపొరుగు మహిళలు చెమ్మగిల్లిన కళ్లతో ఓదార్చారు. తల్లి శోకంతో చూపరులు కన్నీటి పర్యంతమయ్యారు. భార్య వరలక్ష్మి ఆరునెలల గర్భిణి అని, రోడ్డు ప్రమాదంలో వరప్రసాద్ చనిపోయినట్టు ఆమెకు ఎలా చెప్పాలో అర్థం కావడం లేదని బంధువులు, ఆ ఇల్లాలిని ఎలా ఓదార్చాలని మహిళలు ఆందోళన చెందుతున్నారు. భార్య పుట్టింట్లో ఉందని, ఏమని చెప్పి కడసారి చూపునకు తీసుకురావాలా అని బంధువులు తల్లడిల్లుతున్నారు. కుటుంబానికంతకూ ఒకే ఒక్క ఆధారమైన ధర్మవరప్రసాద్‌ను తీసుకెళ్లిపోయి, ఆ కుటుంబానికి దేవుడు అన్యాయం చేశాడని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మేడిశెట్టి మహేష్‌కుమార్ తీవ్రంగా గాయపడడంతో అతడి తల్లిదండ్రులు, భార్య తీవ్ర ఆందోళన చెందారు. ప్రాణాపాయంలేదని తెలియడంతో తేరుకోగా చుట్టుపక్కలవారు ధైర్యం చెప్పారు.

చికిత్స పొందుతున్న బాధితులు

మచిలీపట్నం: ఈ ప్రమాదంలో గాయపడ్డ **మేడిశెట్టి మహేష్‌కుమార్**, చింతా దుర్గాప్రసాద్, రేవు **గణేశ్వరరావు, మల్లెల** శ్రీకాంత్ మచిలీపట్నం **జీజీహెచ్‌లో చికిత్స** పొందుతున్నారు. ఎస్.యానానికి చెందిన సంగాని నాగేంద్రబాబుకు తీవ్ర గాయమవడంతో సీటీ స్కాన్ తీశామని, ఆయన లివర్ దెబ్బ తిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేష్ కుమార్ తెలిపారు. మెరుగైన వైద్యం కోసం నాగేంద్రబాబును విజయవాడలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించామన్నారు.

ఎస్.యానాంలో విషాదం

గ్రామానికి చెందిన ఇద్దరు మృతి.. ముగ్గురికి తీవ్ర గాయాలు



మృతుడు కనకరాజు ఇంటి వద్ద విషాదంలో ఉన్న గ్రామస్తులు

ఉప్పలగుప్తం: ఎప్పటిలాగే చేపల పట్టుబడికి వెళ్లిన ఐదుగురు యువకుల్లో ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడగా.. మరో ముగ్గురు గాయపడడంతో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలో విషాదం అలముకుంది. తాళ్లరేవుకు చెందిన ఓ చేపల వ్యాపారి దగ్గర ఎస్.యానాం గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు కూలీలుగా పని చేస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం సాయంత్రం వారు తమ ఇంటి నుంచి వెళ్లారు. చేపల లోడు తీసుకుని రావడానికి కృష్ణా జిల్లా మచిలీపట్నం ప్రాంతానికి తాళ్లరేవు నుంచి వీరందరూ బయలుదేరారు. సీతనపల్లి వద్ద తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో రేవు భూషణం (24), పెనంగి కనకరాజు (36) అక్కడికక్కడే మృతి చెందగా మల్లాడి శ్రీకాంత్, రేవు జ్ఞానేశ్వరరావు, సంగాని నాగేంద్ర బాబు తీవ్ర గాయాలపాలయ్యారు. నాగేంద్రబాబును విజయవాడ ఆసుపత్రికి, శ్రీకాంత్, జ్ఞానేశ్వరరావులను కాకినాడ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలిసిన వెంటనే గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, లంకే చిరంజీవి, రేవు తిరుపతిరావు, రాజేష్, మట్టా నాగరాజు, ఉడుం కిషోర్, లంకే నాగరాజు తదితరులు ఘటనా ప్రాంతానికి వెళ్లారు.

గర్భిణికి నిండు శోకం

ఈ ప్రమాద మృతుడు భూషణం.. నిర్మలాజ్యోతి అనే యువతిని ప్రేమించి, పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడు. ప్రస్తుతం ఆమె ఆరు నెలల గర్భిణి. కష్టాన్నే నమ్ముకున్న భూషణం గ్రామంలో ఏ పని ఉంటే అది చేసుకుంటాడు. అతడి అన్న రేవు జ్ఞానేశ్వరరావు చేపల పట్టుబడి, ప్యాకింగ్‌కి వెళ్తుంటాడు. ఇటీవల ప్యాకింగ్ పనిపై ఆసక్తి చూపిన భూషణం కూడా అన్న వెంట చేపల ప్యాకింగ్‌కు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భర్త మృత్యువాత పడడంతో గర్భిణి అయిన నిర్మలాజ్యోతి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. పుట్టబోయే బిడ్డ తండ్రి ఏడంటే ఏం చెప్పేది అంటూ విలపిస్తోంది.

నాన్న.. ఇక రారా అమ్మా...



రేవు భూషణం (ఫైల్)



పెనంగి కనకరాజు (ఫైల్)

మరో మృతుడు పెనంగి కనకరాజు హైదరాబాద్‌లో వెల్డింగ్ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గతంలో బైక్‌పై వెళ్తూ ప్రమాదానికి గురై విశ్రాంతి నిమిత్తం గ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచీ గ్రామంలో చేపలు, రొయ్యల పట్టుబడులకు వెళ్లేవాడు. ఈ మధ్య కాలంలో వేట తక్కువగా ఉండటంతో చేపల ప్యాకింగ్ జట్టుకు వెళ్తున్నాడు. ఇతడికి 12 సంవత్సరాల కుమారుడు, పదేళ్ల కుమార్తె ఉన్నారు. చేపల ప్యాకింగ్ నిమిత్తం జట్టుతో బయలుదేరిన కనకరాజు ఈ ప్రమాదంలో మృతి చెందిన వార్త తెలిసి భార్య వెంకటలక్ష్మి బోరున విలపిస్తోంది. పిల్లలిద్దరూ అమ్మా.. నాన్న ఇక రారా.. అంటూ తల్లిని అడగడం చూపరులకు కంటతడి పెట్టించింది.

రాబడిలో గొప్పాయి

- బొప్పాయి సాగు.. భలే బాగు
- పెట్టుబడి తక్కువ.. లాభాలు ఎక్కువ
- జిల్లాలో పెరిగిన సాగు విస్తీర్ణం



బొప్పాయి రైతులకు సూచనలు ఇస్తున్న పిఠాపురం ఉద్యాన అధికారి శైలజ

పిఠాపురం: ఒకప్పుడు ఇంటి పెరటికే పరిమితమైన బొప్పాయి.. నేడు అధిక దిగుబడి, ఆకర్షణీయమైన పండ్లను ఇచ్చే రకాలు అందుబాటులోకి రావడంతో పంట పొలాల్లో తోటలుగా సాగు అవుతోంది. ఒకసారి నాటితే రెండేళ్ల పాటు నిరంతరాయంగా దిగుబడి పొందే అవకాశం ఉండటంతో దీని సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు వంద టన్నులు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉండటంతో సరైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటిస్తే దిగుబడి మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు ఉద్యాన అధికారులు. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం 230 మంది రైతులు 52.06 హెక్టార్లలో బొప్పాయి తోటలు సాగు చేస్తున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు, జగ్గంపేట, తుని తదితర ప్రాంతాల్లో ఈ పంట సాగు ఏటా పెరుగుతోంది. జిల్లా నుంచి ఏటా సుమారు 5,500 టన్నుల బొప్పాయి పండ్లను ఢిల్లీ, ముంబై వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం టన్ను బొప్పాయి ధర రూ.12 వేలు ఉంది. తక్కువ పెట్టుబడితో అధికంగా లాభాలు వస్తూండటంతో రైతులు బొప్పాయి సాగుపై మొగ్గు చూపుతున్నారు.

ఎంతో మేలు

ఇతర పండ్లతో పోలిస్తే బొప్పాయిలో కెరోటిన్, విటమిన్లు అత్యధికంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఔషధ గుణాలు అధికంగా ఉండటంతో బొప్పాయి వినియోగం నానాటికీ పెరుగుతోంది. కరోనా వచ్చినప్పటి నుంచి మరింత పెరిగింది. బొప్పాయి ఉష్ణ మండలపు పంట. 35 నుంచి 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య ఈ మొక్కలు బాగా పెరుగుతాయి. నీరు నిల్వ ఉండని ఎర్ర నేలలు, తేలికపాటి నల్లరేగడి నేలలు దీని సాగుకు బాగా అనుకూలం. మురుగు నీటి సౌకర్యం, నీటి వసతి ఉంటే బొప్పాయిని ఏడాది పొడవునా ఏ సమయంలోనైనా నాటుకోవచ్చు. ఉదజని సూచిక 6.5 నుంచి 7 మధ్య ఉన్న నేలలు అనుకూలమని అధికారులు అంటున్నారు. తెగుళ్లు, వైరస్‌లు కొంత ఇబ్బంది పెడుతున్నప్పటికీ ఉద్యాన అధికారుల సూచనలతో రైతులు వాటిని అధిగమించి మంచి లాభాలు పొందుతున్నారు. తైవాన్ రెడ్ లేడీ-786, వాషింగ్టన్, సోలో, కోయంబత్తూర్-1, కోయంబత్తూర్-2, పూసా డెలీషియస్, పూసా మెజిస్టిక్ రకాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి.



విరగకాసిన బొప్పాయి మొక్కలు

సాగు, సస్యరక్షణ ఇలా..

- ఎకరాకు 20 గ్రాముల విత్తనాలు సరిపోతాయి. కిలో విత్తనానికి 5 మిల్లీలీటర్ల ఇమిడోక్లోఫిడ్ ఎఫ్ఎస్ మందు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. దీని వలన రసం పీల్చు పురుగులను కొంతవరకూ అరికట్టవచ్చు.
- విత్తనాలను ప్లాస్టిక్ సంచులలో విత్తుకుని నారు తయారు చేసుకోవాలి. విత్తన సంచులను షేడ్ నెట్‌ల కింద ఉంచితే అనుకూల వాతావరణ పరిస్థితులు, రసం పీల్చే పురుగుల దాడి నుంచి రక్షణ కల్పించవచ్చు. తద్వారా నారును కాపాడుకోవచ్చు.
- మొక్కలకు 15 రోజుల వయసులో లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపిన ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలి. దీనివలన నారుకుళ్లు తెగులు సోకకుండా కాపాడుకోవచ్చు.
- 40 రోజుల తరువాత పొలంలో నాటుకునేందుకు నారు సిద్ధమవుతుంది. పొలాన్ని రెండుమూడు సార్లు 30 నుంచి 40 సెంటీమీటర్ల లోతు దుక్కి దున్నడం వల్ల భూమిలోని చీడపీడలు మొదట్లోనే నాశనమవుతాయి.
- మొక్కల మధ్య 1.8 మీటర్ల ఎడం ఉండేలా నాటుకోవాలి. మొక్క నాటుకోవడానికి 40 సెంటీమీటర్ల పొడవు, వెడల్పు గుంత తవ్వాలి. మొక్క నాటే సమయంలో మట్టిలో 20 కిలోల పశువుల ఎరువు, కిలో వేపపిండి, 20 గ్రాముల అజోస్పైరిల్లమ్ ఫాస్ఫో బ్యాక్టీరియా కలిపి గుంతలు నింపుకోవాలి.
- 40 నుంచి 60 రోజుల వయసు ఉన్న మొక్కలను సాయంత్రం పూట చల్లని వాతావరణంలో నాటుకోవాలి. ఆరో నెల నుంచి దిగుబడి ప్రారంభమవుతుంది.
- ఏడాదికి ఒక్కో మొక్కకు 10 కిలోల పశువుల ఎరువు, 2 కిలోల వేపపిండి లేదా ఆముదం పిండి, 500 గ్రాముల యూరియా, 1.6 కిలోల సూపర్ ఫాస్పేట్, 850 గ్రాముల పొటాష్ కలిపి ఆరు సమ భాగాలుగా చేసుకుని ఒక్కో నెలకు ఒక్కో దఫాగా రెండు నెలల పాటు అందించాలి.
- ప్రతి మొక్క నాటే సమయంలో 20 గ్రాముల యూరియా, 20 గ్రాముల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. నాటిన 5 నుంచి 8 వారాల మధ్య ప్రతి రెండు మూడు వారాలకు మోతాదు పెంచాలి.
- తేలికపాటి నేలల్లో సూక్ష్మధాతు లోపాలు తలెత్తే అవకాశం ఉంది. దీని నివారణకు లీటరు నీటికి 5 గ్రాముల జింక్ సల్ఫేట్, గ్రాము బోరాక్స్ కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.
- డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలో నీటిని అందించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా ఎదిగి, మంచి దిగుబడులు అందిస్తాయి. ప్రతి మొక్కకు మామూలు రోజుల్లో రోజుకు 8 లీటర్లు, వేసవిలో 25 లీటర్ల నీరు అందించాలి.
- పంట నాటిన సమయంలో నారు కుళ్లు తెగులు సమస్యగా ఉంటుంది. దీని నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి మొక్క మొదలు చుట్టూ వేయాలి.
- రసం పీల్చు పురుగులు, తెగుళ్లు బొప్పాయికి ప్రధాన శత్రువులు. తెల్లదోమ, పేనుబంక, తామర పురుగు, మొజాయిక్ రింగ్ స్పాట్ వైరస్ ఆకుముడత ద్వారా ఆశించి తీవ్ర నష్టాలు తెచ్చి పెడతాయి. వీటి నివారణకు జిగురు పూసిన పసుపు, నీలం రంగు అట్టలు ఎకరాకు 20 చొప్పున ఏర్పాటు చేసుకోవాలి. తొలి దశలో లీటరు నీటికి 5 మిల్లీలీటర్ల వేపనూనె కలిపి పిచికారీ చేసుకుకోవాలి. ఉధృతి ఎక్కువగా ఉంటే లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల ప్రొఫెనోఫాస్ లేదా 1.6 మిల్లీలీటర్ల మోనోక్రోటోఫాస్ లేదా 2 మిల్లీలీటర్ల ఫిప్రోనిల్ కలిపి మొక్కంతా తడిసేలా పిచికారీ చేయాలి.
- పండ్ల నాణ్యత దెబ్బ తీసే పండు ఈగ నివారణకు లింగాకార బుట్టలు ఏర్పాటు చేసుకోవాలి. దీని ఉధృతి ఎక్కువగా ఉంటే 2 లీటర్ల నీటికి 100 మిల్లీలీటర్ల మలాథియాన్, 100 గ్రాముల చక్కెర, 100 గ్రాముల బెల్లం, 100 గ్రాముల మొలాసిస్ కలిపి, పళ్లాల్లో మొక్కల దగ్గర పెట్టాలి. ఆ వాసనకు ఆకర్షితమైన పండు ఈగలు వాటిపై వాలి చనిపోతాయి.

వైరస్‌లతో ఇబ్బంది



ఐదేళ్లుగా బొప్పాయి సాగు చేస్తున్నాను. ప్రస్తుతం ఐదెకరాల్లో తోట ఉంది. ఎకరానికి రూ.1.20 లక్షల పెట్టుబడి అవుతోంది. పంట బాగా అంది వస్తే ఎకరానికి రూ.4.50 లక్షల వరకూ వస్తుంది. రెండేళ్లుగా వైరస్‌లు సోకి పంట దెబ్బ తింటోంది. దీనివలన పెట్టుబడి పెరిగి, ఆదాయం తగ్గుతోంది. దిగుబడి బాగుంటే ఆదాయం కూడా బాగుంటుంది.

– గొల్లపల్లి నానాజీ, దుర్గాడ, గొల్లప్రోలు మండలం

సస్యరక్షణ చేపట్టాలి



వైరస్‌లు, కాండం తొలుచు పురుగుల వల్ల బొప్పాయికి ఎక్కువ నష్టాలు కలుగుతాయి. వాటి నివారణకు తగిన జాగ్రత్తలు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించాలి. బొప్పాయి సాగు మరింత పెంచడానికి రైతుల్లో అవగాహన కల్పిస్తున్నాం. దిగుబడులకు తగినట్టు మార్కెట్ కూడా ఉండటంతో రైతులకు మంచి లాభాలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు వస్తూండటంతో మంచి గిరాకీ లభిస్తోంది. – **ఎస్.మల్లికార్జునరావు**, జిల్లా ఉద్యాన అధికారి, కాకినాడ

క్లుప్తంగా

భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో పదేళ్ల జైలు

కాకినాడ లీగల్: భార్యపై హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ కాకినాడ మూడో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఎస్.రమేష్‌నాయుడు శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ రూరల్ రమణయ్యపేట, పాత గైగోలుపాడుకు చెందిన నరాల కుమారికి 20 సంవత్సరాల క్రితం నరాల సూరిబాబుతో వివాహమైంది. అనంతరం భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చి తరుచూ భార్యను అనుమానంతో భర్త సూరిబాబు వేధించేవాడు. 2022 మే 21 తేదీన భార్య నిద్రిస్తుండగా ఆమెను చాకుతో కడుపులో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో ఆమె కుమార్తె ఇచ్చిన ఫిర్యాదుపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో భర్త సూరిబాబుపై నేరం రుజువుకావడంతో పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ సత్తి గంగాదేవి ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

సబ్‌జైలులో యథావిధిగా ములాఖత్

కాకినాడ లీగల్: తీవ్రమైన ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఇటీవల కాకినాడ సబ్ జైలులోని ముద్దాయిలను వారి బంధుమిత్రులు కలిసే (ములాఖత్) సమయం మార్చారు. అయితే ఉష్ణోగ్రతలు తగ్గడంతో పూర్వ విధంగానే ఈ నెల 17వ తేదీ నుంచి మార్పు చేసినట్లు కాకినాడ స్పెషల్ సబ్ జైలు సూపరింటెండెంట్ ఎం.వీరబాబు శుక్రవారం తెలిపారు. ముద్దాయిలను కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కలిసేందుకు అవకాశం కల్పించారు.

పొదుపు.. జీవితానికి మదుపు

- ఆదా చేస్తేనే బంగారు భవిష్యత్తు
- లేదంటే జీవన గమనం ఛిద్రం
- ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడమే సురక్షితం
- అధిక వడ్డీకి ఆశపడి ప్రైవేట్‌గా నిల్వ చేసుకుంటే ముప్పే





కాకినాడ సిటీ: పొదుపు మానవ జీవన క్రమంలో అత్యంత కీలకం. భవిష్యత్ అవసరాలు.. అత్యవసర పరిస్థితులకు ఎదురొడ్డి నిలబడాలంటే డబ్బు నిల్వ చేసుకోవడం ఒక్కటే మార్గం. లేదంటే ఆర్థిక ఒత్తిళ్లకులోనయ్యే పరిస్థితి దాపురిస్తుంది. అందుకే ఆనందకర జీవితానికి మన దగ్గర కొంత నిధి ఉండడం చాలా అవసరం. కాగా, పొదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో మాత్రమే చేయాలి. అప్పుడే సురక్షితం. అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు సంస్థల జోలికి వెళ్తే ముప్పు తప్పదని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు.

పొదుపు సంస్థల్లో పొదుపు క్షేమం:

భవిష్యత్తు అవసరాల కోసం ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో కొంత సొమ్మును పొదుపు చేస్తారు. అయితే కొంతమంది బ్యాంక్‌లు, పోస్టాఫీసుల్లో పొదుపు చేయకుండా ప్రైవేట్ వ్యక్తులకు వ్యక్తిగత అప్పులు ఇవ్వడం, ప్రైవేటు కంపెనీల్లో పొదుపు చేస్తారు. మరికొంతమంది చిట్టీలు వేస్తారు. ఇది ప్రమాదమని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఒక్కొక్కసారి ప్రైవేటు వ్యక్తులకు అప్పు ఇచ్చి రాబట్టుకోవడానికి కోర్టులు చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రైవేటు సంస్థ అధిక వడ్డీకి ఆశపడి పొదుపు చేస్తే మొదటికే మోసం జరిగే అవకాశాలున్నాయి.

కాకినాడ నగరంతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా ఇటీవల ఎన్నో ప్రైవేటు చిట్టీదారులు, పొదుపు సంస్థలు బోర్డులు తిప్పేయడంతో ఎన్నో కుటుంబాలు వీధిన పడిన సంగతి తెలిసిందే. సొమ్మును ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడం వల్ల భరోసా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

రికరింగ్ డిపాజిట్లు

బ్యాంకులు, పోస్టాఫీసుల్లో రికరింగ్ డిపాజిట్లు (ఆర్‌డీ) అకౌంట్‌లను ఏర్పాటు చేసుకునే వీలుంది. నెలనెలా కొంత మొత్తం పొదుపు చేసుకుని దానిపై వడ్డీ పొందొచ్చు. నెలకు నిర్ధిష్టంగా కొంత సొమ్మును నిర్ణీత కాలం వరకు జమ చేసుకోవాల్సి ఉంటుంది. నిర్ణీత కాల పరిమితి ముగిసిన తరువాత ఆర్‌డీ సొమ్మును వడ్డీతో సహా బ్యాంక్‌లు ఖాతాదారులకు చెల్లిస్తాయి. కనీసం రూ.100 నుంచి ఆర్‌డీ పొదుపు చేసుకునే వీలుంది. పదేళ్ల వరకు ఆర్‌డీలు చేసుకోవచ్చు. సీనియర్ సిటిజన్స్‌కు కొంత అదనపు వడ్డీ ఇస్తారు.

ఖాతాదారుల సౌకర్యార్థం..

ఖాతాదారుల సౌకర్యార్థం వివిధ బ్యాంకులు ట్యాక్స్ సేవింగ్ డిపాజిట్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంక్, పోస్టాఫీసులతో పాటు కొన్ని ప్రైవేటు బ్యాంక్‌లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ ద్వారా కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను సమకూరుస్తున్నాయి.

డిపాజిట్ రకాలు

ఫిక్స్‌డ్ డిపాజిట్లు కూడా రెండు రకాలు ఉన్నాయి. టర్మ్ డిపాజిట్, స్పెషల్ డిపాజిట్. టర్మ్ డిపాజిట్ మీద వడ్డీ ప్రతీ ఆరునెలలకు ఒకసారి జమ అవుతుంది. స్పెషల్ టర్మ్ డిపాజిట్లపై వచ్చే వడ్డీ అదే డిపాజిట్లోని ఖాతాకు జమ అవుతుంది. అందువల్ల ఖాతాదారుడికి వడ్డీ మీద వడ్డీ వస్తుంది.

డిపాజిట్ ఎలా?

కొంత మొత్తం నిర్ణీత కాలానికి పొదుపు చేస్తే అలాంటి డిపాజిట్లను ఫిక్స్‌డ్ డిపాజిట్లు అంటారు. ఫిక్స్‌డ్ డిపాజిట్ సొమ్మును బ్యాంకుల్లో ఏడు రోజుల నుంచి గరిష్టంగా 10 సంవత్సరాల వరకు దాచుకునే వీలుంది. కాలం, జమ చేసిన మొత్తం బ్యాంకులను బట్టి వడ్డీ శాతం మారుతుంటుంది. సీనియర్ సిటిజన్స్‌కు వడ్డీ కాస్త ఎక్కువ చెల్లిస్తారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు పిల్లల పేరున కూడా ఐదేళ్లు అంతకంటే ఎక్కువ కాలానికి చేసుకునే వీలుంది.

ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేయాలి



అవసరానికి డబ్బు కావాలనుకునే వారు వడ్డీ కోసం ఆశపడకుండా ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేసుకోవాలి. ముఖ్యంగా జాతీయ బ్యాంకులు, పోస్టాఫీసుల్లో పొదుపు చేసుకోవడం వల్ల డబ్బుకు భరోసా ఉంటుంది. ఈ డబ్బును ఎలా దాచుకోవాలనే విషయమై వివిధ పద్ధతులు ఉన్నాయి. ఇలా దాచుకుంటున్న సొమ్ముకు కూడా వడ్డీలు ఇస్తున్నాం.

సీహెచ్ వెంకట ప్రసాద్,
జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్, కాకినాడ

భార్యను హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు

కాకినాడ లీగల్: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురిచేసి హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ మూడో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి పి.కమలాదేవి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. రాజానగరం జెడ్పీ హైస్కూల్‌లో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసిన ,గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన బిక్కిల్లి రామకృష్ణతో హారతిలక్ష్మికి 2012లో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. వివాహమైన కొద్దిరోజుల అనంతరం అదనపు కట్నం కోసం, శారీరకంగా, మానసిక వేధింపులకు భర్త గురిచేసేవాడు. బిక్కిల్లి హారతిలక్ష్మి ఎల్ఐసీ కొవ్వూరు బ్రాంచ్‌లో అసిస్టెంట్‌గా పనిచేసేది. ఆమె భర్త వేధింపులు భరించలేక కొవ్వూరు పోలీసులుకు ఫిర్యాదు చేయగా వరకట్నం కేసు నమోదు చేశారు. అనంతరం ఆమె బదిలీపై కాకినాడ ఎల్ఐసీలో చేరి విధులు నిర్వహించింది. వారు కోర్టు ద్వారా రాజీ చేసుకోవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఒక పథకం ప్రకారం కాకినాడ వాకలపూడి సమీపం వద్దకు భార్య హారతిలక్ష్మిని 2014 డిసెంబర్ 3వ తేదీన తీసుకువచ్చాడు. భార్యను కత్తితో పొడిచి హత్య చేశాడు. దీంతో మృతురాలు తండ్రి అంబటి అప్పారావు కాకినాడ సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో భర్త రామకృష్ణపై నేరం రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ 10వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కె.ఆదిత్యకుమార్ నిర్వహించారు.

కొమ్మనాపల్లిలో ప్రబలిన డయేరియా

ఒకరి మృతి.. 60 మందికి అస్వస్థత

అన్నవరం: కాకినాడ జిల్లా తొండంగి మండలం కొమ్మనాపల్లి గ్రామంలో డయేరియా కారణంగా ఒక మహిళ మృతి చెందగా 60 మందికి పైగా అస్వస్థతకు గురయ్యారు. ఉప్పాడ కొత్తపల్లి మండలం రమణక్కపేట గ్రామానికి చెందిన సి.నాగమణి (36) కుటుంబ సభ్యులతో కలిసి రెండేళ్లుగా కొమ్మనాపల్లిలో నివాసం ఉంటున్నారు. ఆమె రెండ్రోజులుగా వాంతులు, విరేచనాల కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై శుక్రవారం మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. డయేరియా కారణంగా అస్వస్థతకు గురైన మిగిలిన వారికి స్థానిక సచివాలయంలో తాత్కాలికంగా బెడ్లు ఏర్పాటుచేసి చికిత్స అందిస్తున్నారు. ఇంకొంతమంది బాధితులు ప్రయివేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నట్టు తెలిపారు. డీఎంహెచ్‌ఓ నర్సింహనాయక్, డీపీఓ సౌజన్య శుక్రవారం బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యులు బాధితులకు చికిత్స అందిస్తున్నారని, పరిస్థితి విషమంగా ఉన్నవారిని కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్యం చేయిస్తున్నామని తెలిపారు. వైద్యాధికారులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ భారతి, ఇతర సిబ్బంది వైద్య సేవలందిస్తున్నారు.



వైద్య శిబిరంలో అందుతున్న సేవలను పరిశీలించిన ఎమ్మెల్యే దివ్య, డీఎంహెచ్‌వో నరసింహనాయక్

బాధితులను పరామర్శించిన యనమల దివ్య, వైఎస్సార్ సీపీ నేతలు

కొమ్మనాపల్లిలో డయేరియా బాధితులను తుని శాసన సభ్యురాలిగా ఎన్నికైన యనమల దివ్య శుక్రవారం ఓదార్చారు. అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉన్నందున ఎవరూ అధైర్యపడనవసరం లేదని తెలిపారు. కాగా, వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు, తొండంగి వైస్ ఎంపీపీ నాగం గంగబాబు కూడా బాధితులను పరామర్శించారు.

ముద్దులొలుకు నా సామికి.. బుగ్గన చుక్క!



స్వామి, అమ్మవార్లకు బుగ్గన చుక్క పెడుతున్న అర్చకులు



పందిరి రాటకు పూజలు చేస్తున్న ఆలయ ఈఓ మాధవి

- శ్రీ బాల బాలాజీకి ముద్రికాలంకరణ
- కల్యాణోత్సవాలకు పందిరి రాట ముహూర్తం

మామిడికుదురు: 'శ్రియః కాంతాయ కల్యాణ నిధయే నిధయేర్థినాం.. శ్రీ వేంకట నివాసాయ శ్రీనివాసాయ మంగళమ్' అంటూ భక్తుల వేనోళ్ల పూజలందుకుంటున్న అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి వారిని శుక్రవారం పెండ్లి కుమారుడిగా, శ్రీదేవి, భూదేవిలను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తూ బుగ్గన చుక్క పెట్టి కల్యాణ తిలకం దిద్ది ముద్రికాలంకరణను అర్చకులు వైభవంగా జరిపించారు. శ్రీక్రోధి నామ సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ అష్టమి ఘడియలో కల్యాణోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అదే సమయంతో ఆలయ కార్య నిర్వహణాధికారి గ్రంధి మాధవితో ముఖ్య అర్చక గొడవర్తి శ్రీనివాసాచార్యులు, వేద పండితులు జ్యోత్సుల సోమయాజులు, అర్చకులు పందిరి రాట వద్ద ప్రత్యేక పూజలు చేయించారు. భక్తుల కోలాహలం నడుమ పందిరి రాట పాతారు. ఈ నెల 16వ తేదీ ఆదివారం నుంచి 20వ తేదీ గురువారం వరకు స్వామి వారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 17వ తేదీ జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సోమవారం రాత్రి 8.59 గంటలకు శ్రీబాల బాలాజీ స్వామి దివ్య తిరు కల్యాణం జరుగుతుందని ఏసీ మాధవి తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కంకిపాటి నరసింహారావు, పాటి గోవిందు, కోలా రాంబాబు, తులా ఉమ, తులా బ్రహ్మాజీ, పడవల మల్లేష్, కేతా శ్రీనివాస్, కంకిపాటి సుబ్బారావు, బొంతు ఆనందరావు, మాకే సత్యశ్రీధర్, పాటి వెంకట్రావు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కూలి డబ్బు కోసం కొట్టి చంపేశాడు

భోగాపురంలో వ్యక్తి దారుణ హత్య



మృతుడు ప్రసాద్ (ఫైల్)

పిఠాపురం: కూలి పని చేసిన డబ్బు అడిగితే ఇవ్వలేదనే కోపంతో ఒక వ్యక్తిని దారుణంగా హత్య చేసిన ఘటన పిఠాపురం మండలం భోగాపురంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భోగాపురానికి చెందిన బ్రహ్మదేవ ప్రసాద్ (48)కి వరుసకు మేనల్లుడు అయిన నాగులాపల్లి పద్మరాజు కలసి కాకినాడలో కూలి పనికి వెళ్లే వారు. అయితే ఇద్దరి మధ్య కొన్ని రోజులుగా కూలి డబ్బు విషయంలో వివాదం జరుగుతోంది. తనకు ఇవ్వాల్సిన డబ్బు ఇవ్వడం లేదనే కోపంతో నా డబ్బు ఇవ్వక పోతే చంపేస్తానంటూ పద్మరాజు ప్రసాద్‌ను బెదిరించేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి ఇద్దరి మధ్య డబ్బు విషయంలో తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. డబ్బు ఇవ్వకపోతే చంపేస్తానంటూ బెదిరించాడు. భోగాపురంలో ఉన్న కనకదుర్గ గుడిలో నిద్రిస్తున్న ప్రసాద్‌ను పద్మరాజు ఒక రాయితో కొట్టి హత్య చేసినట్టు పోలీసులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో కింద పడి బాలుడి మృతి

పి.దొంతమూరులో విషాదం

పిఠాపురం: ఆటాడుకుంటూ తెలియకుండా ఆగి ఉన్న ఆటో కిందకు దూరిన బాలుడిపై నుంచి ఆటో వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పిఠాపురం మండలం పి.దొంతమూరులో శుక్రవారం తీవ్ర విషాదాన్ని నింపింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం పి.దొంతమూరుకు చెందిన కుక్కల వెంకటరావు కుమారుడు అశ్విన్ (4) శుక్రవారం వీధిలో ఆడుకుంటున్నాడు. ఇంతలో అక్కడకు ఉప్పు అమ్ముకునే ఆటో ఒకటి వచ్చి ఆగింది. ఆటలో భాగంగా ఆ బాలుడు ఆటో కిందకు దూరి దాక్కున్నాడు. ఇది గమనించని ఆటో డ్రైవరు ఆటోను నడపడంతో ఆటో కింద పడి బాలుడు నలిగిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బాలుడి తండ్రి వెంకటరావు కూలి పని చేసుకుంటుంటాడు. మృతుడికి తల్లి. రెండేళ్ల తమ్ముడు ఉన్నాడు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సముద్ర స్నానానికి దిగి యువకుడు...



మృతుడు అనిరుధ్

ఉప్పలగుప్తం: సముద్ర స్నానానికి దిగి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని ఎస్.యానం గ్రామంలో చోటు చేసుకుంది. విశాఖకు చెందిన ఓ యువకుడు ఎస్.యానం గ్రామంలో ఉన్న రవ్వ ప్లాంటులో ఉద్యోగం చేస్తూ గ్రామంలోనే నివాసముంటున్నాడు. స్నేహితుడిని కలవడానికి విశాఖపట్నం నుంచి ముగ్గురు యువకులు ఎస్.యానం వచ్చారు. స్నేహితుడు తన విధుల్లో ఉండడంతో కలవటానికి సమయం పడుతుందని స్థానికంగా ఉన్న బీచ్‌కు వెళ్లి సముద్ర స్నానానికి దిగారు. వారిలో అనిరుధ్ (24)నీటిలో మునిగిపోయాడు. అక్కడున్న మత్స్యకారులు ఆ యువకుడిని ఒడ్డుకు చేర్చి స్థానికంగా ఉన్న పీహెచ్‌సీకు తీసుకెళ్లగా అంబులెన్స్‌లో ఉన్న బాధితుడిని వైద్యాధికారి లోవసుధ పరీక్షించి ఏరియా ఆసుపత్రికి తీసుకుని వెళ్లాలని సూచించారు. తమ స్నేహితుడు మృతి చెందాడని గుర్తించిన స్నేహితులు ఏరియా ఆసుపత్రి నుంచి విశాఖపట్నం తీసుకుని వెళ్లినట్టుగా సమాచారం.

విద్యుదాఘాతంతో వెల్డింగ్ వర్కర్ మృతి



జితేంద్ర మృతదేహం

కోనేరుసెంటర్(మచిలీపట్నం): విద్యుదాఘాతంతో వెల్డింగ్ వర్కర్ మృతి చెందిన సంఘటన మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన బల్లా జితేంద్ర(23) కొన్ని రోజులుగా మచిలీపట్నం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో పని చేసేందుకు వచ్చాడు. కాంట్రాక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం జితేంద్ర రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై రేకులకు వెల్డింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు హైటెన్షన్ వైర్లు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. ఈ ప్రమాదంలో జితేంద్ర శరీరం కాలిపోవటంతో అక్కడికక్కడే కూలిపోయాడు. ప్రమాదాన్ని ప్రత్యక్షంగా చూసిన రైల్వే అధికారులు చికిత్స నిమిత్తం బాధితుడిని మచిలీపట్నం సర్వజన ఆస్పత్రికి తరలించారు. అప్పటికే జితేంద్ర మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు కాంట్రాక్టర్ ద్వారా మృతుని వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో జెడ్పీ చైర్మన్ సోదరుడి మృతి



విప్పర్తి రామారావు (ఫైల్)

మామిడికుదురు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు సోదరుడు (అన్న) విప్పర్తి రామారావు (72) గురువారం రాత్రి గుండెపోటుతో అయన స్వగృహం ధవళేశ్వరంలో మృతి చెందారు. రామారావు భార్య గతంలోనే మృతి చెందారు. రామారావుకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె సంతానం. ఆయన అంత్యక్రియలు రాజమహేంద్రవరంలో శుక్రవారం నిర్వహించారు. సోదర వియోగంతో బాధపడుతున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావును పలువురు పరామర్శించారు. రామారావు మృతికి సంతాపం తెలిపి, సానుభూతిని తెలియజేశారు.

కూలీ దుర్మరణం



విద్యుదాఘాతానికి గురై మృతిచెందిన భాస్కరరావు (39)

ప్రత్తిపాడు: విద్యుదాఘాతానికి గురై వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానిక పోలీసుల కథనం మేరకు ధర్మవరం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ బెజవాడ భాస్కరరావు (39) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం తన ఇంటి సమీపాన ఉన్న నేరేడు చెట్టు పండ్లను కోస్తున్నాడు. చెట్టును రాసుకుంటూ విద్యుత్ తీగలుండడంతో విద్యుదాతానికి గురై అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బంధువులు ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలిస్తుండగా, మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని సోదరుడు వీరరాఘవులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మృత్యువాత



స్వామి (ఫైల్)

రౌతులపూడి: తేటగుంట - రౌతులపూడి ఆర్ అండ్ బీ రహదారిలో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో పారుపాక గ్రామానికి చెందిన బండారు స్వామి(21) మృతిచెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రౌతులపూడి పోలీసలు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పారుపాక గ్రామానికి చెందిన బండారు స్వామి(21) పారుపాక నుంచి తేటగుంట వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా రౌతులపూడి వైపు వస్తున్న నల్లరాయి తరలించే క్వారీలారీ ఢీ కొట్టింది. దీంతో స్వామి అక్కడికక్కడే కింద పడిపోయి మృత్యువాత పడ్డాడు. ఈ ఘటనపై స్థానికులు కుటుంబ సభ్యులు ఇచ్చిన సమాచారం మేరకు రౌతులపూడి పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు. మృతుడు స్వామికి తల్లి, తండ్రి, భార్య ఉన్నారు.

ఇదిలా వుండగా..

రౌతులపూడి-తేటగుంట రహదారిలో వేగంగా తిరుగుతున్న నల్లరాయి క్వారీలారీల కారణంగా నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని, ఈ కారణంగానే బండారు స్వామి మృతిచెందాడని పారుపాక గామానికి చెందిన మృతుడు కుటంబ సభ్యులు రోడ్డుపై బైఠాయించి కొంతసేపు ఆందోళన చేశారు. తక్షణమే భారీ వాహనాల వేగాన్ని నిరోధించి ప్రమాదాలు జరగకుండా చూడాలని వారంతా డిమాండ్ చేశారు. మృతికి కారణమైన వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని, మృతుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన వృద్ధుడిని కాపాడిన పోలీసులు

తుని: ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఓ వృద్ధుడు ఆత్మహత్యకు ప్రయత్నించగా జీఆర్పీ పోలీసులు, గూడ్స్ రైలు డ్రైవర్ కాపాడారు. శుక్రవారం జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్ తెలిపారు. తొండంగి మండలం చిన్నాయిపాలెంకు చెందిన 82 ఏళ్ల పసుపులేటి గంగరాజు ప్రస్తుతం అనకాపల్లి జిల్లా దొడ్డిగల్లు గ్రామంలో నివాసం ఉంటున్నాడు. వయసు మీరడం, కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకునేందుకు అన్నవరం రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫాం చివరకు వెళ్లి పట్టాలపై తలపెట్టి పడుకుని ఉండగా తుని నుంచి సామర్లకోట వైపు వెళుతున్న గూడ్స్ రైలు డ్రైవర్ గమనించి సైరన్ మోగించడంతో పాటు సడన్ హ్యాండ్ బ్రేకు వేశారు. రైల్వేస్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన తుని జీఆర్పీ ఎస్సై ఎస్‌కే.అబ్దుల్ మారూఫ్‌కు తెలియపరిచారు. ఎస్సై ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ శ్యామ్, పాయింట్ మేన్ ఉపేంద్ర సంఘటన స్థలానికి చేరుకుని ఆత్మహత్యకు యత్నించిన గంగరాజును కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వారు జీఆర్పీ ఎస్సై మారూఫ్, హెడ్ కానిస్టేబుల్ శ్యామ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



గంగరాజును కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న జీఆర్పీ పోలీసులు

జీవ వైవిధ్యం మానవాళికి మూలాధారం

రాజానగరం: జీవ వైవిధ్యం మానవాళికి మూలాధారమని, దానిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరి పైనా ఉందని దివాన్ చెరువులోని ఏపీ స్టేట్ ఫారెస్ట్ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. అకాడమీలో శుక్రవారం నిర్వహించిన జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఇక్కడ పొందిన శిక్షణను మీ గ్రామాలలో ఆచరణలోకి తీసుకువెళ్లి, జీవ వైవిధ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి (గుంటూరు) సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జీవ వైవిధ్యం, బయోడైవర్సిటీ యాక్ట్ గురించి అవగాహన కల్పించారు. శిక్షణకు ఏపీ బయోడైవర్సిటీ బోర్డు కార్యదర్శి బీఏవీ కృష్ణమూర్తి అవసరమైన సదుపాయాలు కల్పించారు. మొదటి రోజు శిక్షణకు రంపచోడవరం, విశాఖపట్నం, విజయనగరం, చీరాల నుంచి వచ్చిన 30 మంది యాజమాన్య కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఏసీఎఫ్‌లు శ్రీహరిగోపాల్, ఎన్‌వీ శివరాం ప్రసాద్, జీవవైవిధ్య మండలి సభ్యులు జానకిరామ్, చెన్న కేశవ నాయక్, సత్యప్రసాద్ పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న జీవ వైవిధ్య యాజమాన్య కమిటీల సభ్యులు